క్లుప్తంగా

అర్బన్ సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ లక్ష్మణ్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం అర్బన్ సీఐగా బి.లక్ష్మణ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్థానిక పోలీసులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అర్బన్ పీఎస్ పరిధిలో శాంతిభద్రతలకు పెద్ద పీట వేస్తామన్నారు. చట్టవ్యతిరేక, సంఘ విద్రోహ కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు చేపట్టిన సీఐని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలసి అభినందనలు తెలిపారు. కాగా ఎస్ఐ సుమన్ అనంతపురం డీటీఆర్‌బీ విభాగానికి బదిలీ అయినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

శుభకార్యం

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత బోయ వన్నూరప్ప కుమారుడు రంజిత్‌- మహాలక్ష్మి వివాహం శుక్రవారం పెన్నహోబిలంలో జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్


సీఐ హరినాథ్ సమక్షంలో సెల్‌ఫోన్ అప్పగిస్తున్న డ్రైవర్ ఆనందరాజు

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న పాల్తూరు గ్రామానికి చెందిన ఆనందరాజు నిజాయితీ చాటుకున్నారు. వివరాలు.. శుక్రవారం ఉరవకొండ పట్టణానికి చెందిన వెంకటేసులు అనే యువకుడు ద్విచక్రవాహనంలో పాల్తూరుకు వెళ్తూ రూ.30 వేలు విలువ చేసే సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. డ్యూటీ ముగించుకుని పాల్తూరుకు వెళుతున్న డ్రైవర్ ఆనందరాజుకు సెల్‌ఫోన్ దొరకడంతో ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్‌కు అప్పగించారు. సీఐ వెంటనే వెంకటేష్‌ను పిలిపించి డ్రైవర్ చేతుల మీదుగా సెల్‌ఫోన్‌ను ఇప్పించాడు. ఈ సందర్భంగా డ్రైవర్‌ను పోలీసులు అభినందించారు.

వ్యక్తికి గాయాలు

కూడేరు: స్థానిక విద్యుత్ ఉప కేంద్రం వద్ద శుక్రవారం అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో ముద్దలాపురానికి చెందిన విష్ణు గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనదారుడు వేగంగా వస్తూ అదుపు తప్పి వెనుక నుంచి ఢీకొట్టాడు. క్షతగాత్రున్ని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం


రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ రూరల్: మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యులు పావని, వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ యుద్ధ రంగంలో చేసిన సేవలకు గుర్తుగా ప్రతి సంవత్సరం మే 12 న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు సరస్వతి, సునీత, ఎంఎల్‌హెచ్‌పీలు భవాని, భారతి, రూప, హిమబిందు, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, శ్రీధర్‌మూర్తి, ఫార్మాసిస్ట్ సరళ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నానదిలో ఇసుక పరిశీలన


ఇసుకను పరిశీలిస్తున్న మైన్స్ అండ్ జియాలజీ అధికారులు

కూడేరు: కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు శుక్రవారం మైన్స్ అండ్ జియాలజీ, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులు పెన్నానదిలో ఇసుకను పరిశీలించారు. ఎంత మేరకు ఇసుక నిల్వ ఉన్నది అంచనా వేశారు. మండలంలో ఇసుక కొరతతో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని, అనుమతిస్తే ఇసుక తవ్వకాలు చేపట్టి నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని ఎంపీపీ నారాయణరెడ్డి అధికారులను కోరారు. మండలంలో ప్రభుత్వం తరపున నిర్మిస్తున్న భవనాల నిర్మాణాలకు ఇసుక తవ్వుకోవడానికి అనుమతి ఇచ్చేందుకు అవకాశాలున్నాయి. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పురుషోత్తం, మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా, వీర్వోలు సాయినాథ్, వెంకట నరసయ్య, విలేజ్ సర్వేయర్ ఓబుళపతి , సూపర్‌వైజర్ మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

- అందుబాటులోకి 63 రకాల వైద్య సేవలు
- వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట


గుమ్మఘట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


పీహెచ్‌సీకి చేరుకున్న వైద్య పరికరాలు

గుమ్మఘట్ట: మండలంలో ఉన్న పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ల్లో రోగులకు జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రి సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్యరంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత కల్పించి ప్రత్యేక నిధులు కేటాయించి ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను పూర్తిగా మార్చివేశారు. అందుకనుగుణంగా పీహెచ్‌సీల్లో తగినంత సిబ్బందిని నియమించి, శిక్షణ ఇచ్చి అత్యంత పారదర్శకంగా సేవలందిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పీహెచ్‌సీలకు అధునాతన యంత్ర సామాగ్రిని అందించి రోగులకు త్వరితగతిన వైద్య సేవలందేలా కృషి చేస్తున్నారు. ఒక్కో పీహెచ్‌సీకి యూరిన్ ఎనలైజర్, టీబీ ఆర్టీ పీసీఆర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్,ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సీబీసీ తదితర యంత్ర పరికరాలను అందచేసింది. గతంలో 15 వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవి. నేడు 63 రకాల వైద్యపరీక్షలు చేసే అవకాశం కల్పించారు. ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ని ప్రత్యేకంగా నియమించారు. ల్యాబ్ టెక్నీషియన్లకు నెల రోజులు పాటు శిక్షణ ఇచాచరు. దీంతో గ్రామీణ ప్రాంత రోగులకు ఎన్నో వ్యయ ప్రయాసాలు తగ్గడంతో పాటు ఉచితంగా వైద్య సేవలు లభించనున్నాయి.

వైద్య సేవలు ఇలా

హెచ్‌బీ, ప్లేట్‌లెట్ కౌంట్, బ్లడ్ గ్రూపు, హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్‌ఏజీ,వీడీఆర్‌ఎల్, గల్ల పరీక్ష, ర్యాండం బ్లడ్ సుగర్, యూరియా క్రియాటిన్, మలేరియా, డెంగీ, వైడల్, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, ఏఎల్‌పీ, లిపిడ్ ప్రొఫెయిల్, సోడియం, పోటాషియం, క్లోరైడ్ , యూరిన్ మైక్రో స్కోపిక్ వంటి 63 రకాల పరీక్షలు చేయనున్నారు.

గతం కన్నా నేడు ఎంతో నయం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందేవి కావు. చిన్న జ్వరం వచ్చినా పట్టణానికి వెళ్లాల్సిన దుస్థితి వుండేది. దీంతో రోగులకు ఆర్థిక భారం అధికంగా పడేది. రోగి పరీక్షల రిపోర్ట్స్ వచ్చే వరకూ సక్రమమైన వైద్యం అందేది కాదు. దూరప్రాంతాలకు వెళ్లలేని పేదరోగులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకునేవారు. ఇలాంటి దుర్భర పరిస్థితులను కళ్లారా చూసి చలించిపోయిన సీఎం జగన్ వాటికి ఫుల్‌స్టాఫ్ పెట్టారు. అత్యాధునిక వైద్య పరికరాలను పీహెచ్‌సీలకు అందించి రోగులకు నాణ్యమైన మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

అత్యాధునిక పరికరాలు వచ్చాయి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్యాధునిక వైద్య పరికరాలు వచ్చాయి. 63 రకాల పరీక్షలు నిర్వహించేందుకు నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీలో రోగులకు ఉచితంగా సేవలందించేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తాను. గతంలో ప్రైవేటు క్లినిక్‌లో పనిచేశాం. నేడు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తు రోగులకు ప్రత్యక్షంగా సేవచేస్తున్నందుకు గర్వంగా ఉంది.

– మాధవరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్, గుమ్మఘట్ట పీహెచ్‌సీ

63 రకాల వైద్య పరీక్షలు



నూతన పరికరాలు అందుబాటులోకి రావడంతో 63 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అవకాశం వచ్చింది. ఇకపై వైద్య పరీక్షల కోసం పట్టణానికి వెళ్లాల్సిన అవసరం లేదు. రోగులకు పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ అయిన తరువాత అవసరమైన వైద్యాన్ని అందిస్తాం. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు లేక పోవడంతో రోగులు అనేక అవస్థలు పడేవాళ్లు.

– రమేష్, వైద్యుడు, గుమ్మఘట్ట పీహెచ్‌సీ

ఉత్తమ వైద్య సేవలే లక్ష్యం



వైద్యరంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేసి నిధులు కేటాయించారు. పేదింటి వారికి వైద్య సేవలు ఆర్థికభారం కాకూడదని తలచి గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా పెట్టుకుని వైద్యసేవలందిస్తున్నాం. 'ఫ్యామిలీ డాక్టర్'ను ప్రత్యేకంగా నియమించి ఇంటివద్దకే వైద్యులు వెళ్లి కదలలేని రోగులకు సైతం సత్వర వైద్యసేవలు అందిస్తున్నాం.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

మంత్రి పెద్దిరెడ్డిని కలసిన మాజీ ఎమ్మెల్యే విశ్వ


మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి శుక్రవారం అనంతపురంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలపై ఆయనతో చర్చించారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం


ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ తదితరులు

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం సర్పంచ్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని ప్రారంభించారు. ఆధార్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, మాజీ సర్పంచ్ చిత్రశేఖరప్ప, నాయకులు మల్లికార్జున, ఖాజాహుస్సేన్ ,అనంతరెడ్డి, రాజు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మయూర వాహనంపై వేంకటరమణుడు


మొక్కులు తీర్చుకుంటున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు

రాయదుర్గంటౌన్: ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీవారు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీవారి ఆలయం వద్ద నుంచి కోట మీదుగా వినాయక సర్కిల్, పాతబస్టాండ్ మీదుగా లక్ష్మీబజార్‌కు వరకు ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామి వసంతోత్సవాన్ని, కంకణ విసర్జన, చక్ర స్నానం, మహామంగహారతి కార్యక్రమాలు వేడుకగా చేపట్టారు. మయూర వాహనంలో దారి పొడవున భక్తులు శ్రీవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు హాజరై రథాన్ని లాగారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి, కౌన్సిలర్ శ్రీలక్ష్మి, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, సుగాలి సంఘం, హరిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు. శనివారం శయనోత్సవ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ తెలిపారు.

అందరికీ కృతజ్ఞతలు

రాయదుర్గం: ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మోత్సవాలను పది రోజుల పాటు ఘనంగా నిర్వహించామని, సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆలయం వద్ద చైర్మన్ పాలాక్షిరెడ్డితో కలసి విప్ మాట్లాడారు.. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, పోలీసు, మున్సిపల్, శ్రీవారి సేవకులు, కుల సంఘం నాయకుల సమష్టి కృషి, భక్తుల సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశామన్నారు. కుల సంఘాల వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటలకు శయనోత్సవంతో ఉత్సవాలు పూర్తిగా ముగుస్తాయన్నారు. ఈ ఏడాది సుమారు లక్ష మందికి పైగా స్వామి దర్శనం పొంది ఉంటారన్నారు. దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి, సిబ్బంది, అర్చక బృందాన్ని విప్ అభినందించారు. అలాగే ప్రసన్న వెంకటరమణుడి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామని విప్ కాపు తెలిపారు. టీటీడీ చైర్మెన్ వైవీ సుబ్బారెడ్డి సహకారంతో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. మరిన్ని నిధులు రాబట్టి ప్రహరి, భక్తుల సౌకర్యార్థం కమ్యూనిటీ భవనం లాంటివి నిర్మించేలా కృషి చేస్తామన్నారు.

నిబంధనలు పాటించకపోతే ఆర్‌ఎంపీ క్లినిక్‌ల సీజ్

రాయదుర్గం టౌన్: నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీలు క్లినిక్‌లు నిర్వహిస్తే సీజ్ చేస్తామని జిల్లా వైద్య విభాగం డెమో భారతి హెచ్చరించారు. శుక్రవారం ఆమెతోపాటు హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్‌తో కలసి పట్టణంలోని ఆర్‌ఎంపీ క్లినిక్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. బళ్లారి రోడ్డులో ఉన్న మూసా క్లినిక్ పేరిట నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ సెంటర్‌లో నలుగురు వ్యక్తులు వైద్యం అందిస్తున్నట్లు గుర్తించి తీవ్రంగా హెచ్చరించారు. వారికి రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కూడా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనాని, ఆయుర్వేదిక్ సర్టిఫికెట్లు ఉన్నాయని చెబుతూ అల్లోపతి మందులు విక్రయించడంపై అభ్యంతరం తెలిపారు. ఆర్‌ఎంపీలు ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే పేరు పెట్టుకోవాలని, ఎలాంటి సూది మందులు, అడ్మిషన్లు చేసుకోవడం చట్ట విరుద్ధమన్నారు. అంతేకాక ఎలాంటి వ్యాధి నిర్ధారణ చేయకూడదన్నారు. చట్ట విరుద్ధంగా ఎవరైనా వైద్యం అందజేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఎంఈఓ కార్యాలయానికి చేరిన పాఠ్యపుస్తకాలు

గుమ్మఘట్ట: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కాకమునుపే ఎంఈఓ కార్యాలయానికి పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం చేరుకున్నాయి. మండలానికి లక్ష పుస్తకాలు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేధికలు పంపడంతో 36 వేల పాఠ్యపుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగమణి తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యేనాటికి పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు చేర్చుతామన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి


బ్రహ్మసముద్రం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


కూడేరు: మాట్లాడుతున్న గ్రంథాలయాధికారిణి రాధారాణి

బ్రహ్మసముద్రం: విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని జీవశాస్త్రం ఉపాధ్యాయుడు రాజన్న సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కథల పుస్తకాలు చదవటం , కథలు వినటం వల్ల నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు కబడ్డీ , క్రికెట్ తదితర క్రీడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి, పాఠకులు ఆనంద, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూడేరు: సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన ఆహారంపై విద్యార్థులకు గ్రంథాలయాధికారిణి రాధారాణి విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులందరికీ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రంగయ్య. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15 నుంచి విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్లు


మాట్లాడుతున్న ఏఓ సంధ్యాకుమారి

శెట్టూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 15 నుంచి రైతులు విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సంధ్యాకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్బీకేలో అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆర్బీకేల్లో విత్తన స్టాక్ కోసం గోడౌన్ ఏర్పాటు చేసుకోవాలని, విత్తన వేరుశనగ కోసం వచ్చే రైతుల వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గరిష్టంగా ఒక రైతుకు మూడు బస్తాల వేరుశనగ ఇస్తామన్నారు. క్వింటాల్ ధర రూ. 9,300 కాగా 40 శాతం (రూ.3,720)రాయితీ పోనూ, రైతు రూ.5,580 చెల్లించాలన్నారు. అర్హులైన రైతులందరికీ వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు.

'వ్యాపారులపై చర్యలు తీసుకోండి'

ఉరవకొండ: స్థానిక మేకల, గొర్రెల మాంసం విక్రయ మార్కెట్‌లో చనిపోయిన గొర్రెలను కోసి వ్యాపారులు విక్రయిస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు మొలక బాల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్‌ను కలసి వినతిపత్రం అందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేక పోవడంతో మాంసం విక్రయదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమడుతున్నారన్నారు. ఈఓ మాట్లాడుతూ నాణ్యమైన మాంసం విక్రయించేలా చర్యలు తీసుకంటామన్నారు.

ముగిసిన దరఖాస్తు గడువు

కూడేరు: కూడేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అనంతపురం రూరల్ మండల పరిధిలో ఖాళీ ఉన్న ఒక అంగన్‌వాడీ, నాలుగు హెల్పర్ పోస్టులకు దరఖాస్తు గడువు శుక్రవారం ముగిసింది. 5 పోస్టులకు 11 దరఖాస్తులు వచ్చినట్లు సీడీపీఓ ధనలక్ష్మి తెలిపారు. పాముదాయిలో అంగన్‌వాడీ పోస్టుకు 3, రాయల్ నగర్‌లో హెల్పర్ పోస్టుకు 2, పాట్టి శ్రీరాములు హెల్పర్ పోస్టుకు 2, కక్కలపల్లి హెల్పర్ పోస్టుకు 3, పీసీ కాలనీలో హెల్పర్ పోస్టుకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు.

హోమియా వైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ హోమియా వైద్యశాలలో వైద్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు ఎస్.లాల్యానాయక్ సూచించారు. రాయదుర్గం ప్రభుత్వాస్పత్రి ఆవరణలో కుడివైపు భవనంలో ప్రభుత్వ హోమియో వైద్యశాల ఉందన్నారు. వారంలో మూడు రోజుల పాటు (సోమవారం, బుధవారం, శుక్రవారం) అందుబాటులో ఉంటానన్నారు. మిగతా మూడు రోజుల పాటు బెళుగుప్పలోని ఆస్పత్రి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. ఆస్పత్రిలో మందులు కొరత లేదని, వివిధ వ్యాధులకు హోమియాపతి వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మొదటి విడత కౌన్సెలింగ్ ద్వారా వివిధ ట్రేడుల్లో సీట్లు పొందడానికి ఆన్‌లైన్ ద్వారా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. జూన్ 6 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సమీపంలోని ఐటీఐ కళాశాలకు వచ్చి ఒరిజనల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు వివరాలకు 9985146746, 9849245925 నంబర్లను సంప్రదించాలన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారిణి లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం: స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అన్ని శాఖల అధికారులు మండలాభివృద్ధికి కృషి చేద్దామని మండల ప్రత్యేక అధికారిణి లక్ష్మీప్రసన్న అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మారుతమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు అందరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా తాగు నీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో నిర్మించనున్న సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్‌సెంటర్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చొరవ చూపాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించే సేవలపై మరింత జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. అనంతరం ఆయా శాఖల పురోగతి, లక్ష్యాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాంతమ్మ, ఎంపీడీఓ బాలాజీ, ఎంఈఓ విజయకుమారి, హెచ్‌ఓ ధనుంజయ, ఏఓ జగదీష్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ హెల్పర్ మాకొద్దు


ఏఈ లక్ష్మీరెడ్డితో మాట్లాడుతున్న మైలాపురం రైతులు

బొమ్మనహాళ్: మండలంలోని ఏలంజి గ్రామ సచివాలయ పరిధిలో కరెంటు హెల్పర్‌గా పనిచేస్తున్న నాగరాజు మాకు వద్దని మైలాపురం గ్రామ రైతులు శరణప్పస్వామి, భీమరెడ్డి, లోకేష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, గంగాధరస్వామి, హనుమంతరెడ్డి, లోకన్న తదితరులు శుక్రవారం బొమ్మనహాళ్‌లోని విద్యుత్ కార్యాలయంలో ఏఈ లక్ష్మీరెడ్డి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. కరెంటు హెల్పర్ నాగరాజు ప్రైవేట్ వ్యక్తులను పెట్టి ప్రతి పనికీ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని , ఒక్కో పనికి ఒక్కో రేటు పెట్టి వసూలు చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెడ్ ఫీజు పోయినా పట్టించుకోకుండా రూ. వెయ్యి ఇస్తే ప్రైవేట్ వ్యక్తులను పంపించి ఫీజులు వేస్తున్నారని, ఏ చిన్న సంఘటన జరిగినా రెండు రోజులు గడిచినా రాడని గట్టిగా ప్రశ్నిస్తే రైతులపైనే కేసులు పెట్టిస్తాడని వాపోయారు. ఆయన తొలగించి వేరేవాళ్లను నియమించాలని డిమాండ్ చేశారు. రైతులు తిప్పన్న, చింతకుంట బీమరెడ్డి, బండి రామాంజనేయులు, ధనుంజయ, వీరభద్రస్వామి , తిమ్మప్ప పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు


ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికుమార్ వద్ద బైండోవర్ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని దొడగట్ట గ్రామంలో శుక్రవారం అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన అమ్మాయి (16)కి, అబ్బాయి (18)తో వివాహం చేయడానికి ఇరు కుటుంబాలు ఒప్పందం కుదుర్చుకుని పెళ్లికి సిద్ధమయ్యారు. విషయంపై 1098కు సమాచారం అందగా సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీఓ బాలాజీ, ఇతర సిబ్బంది గ్రామానికి వెళ్లి ఇరు కుటుంబాల పెద్దలకు బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇరు కుటుంబాల పెద్దలను తహసీల్దార్ ఫణికుమార్ వద్ద బైండోవర్ చేయించారు. నిబంధనలు అతిక్రమించి బాల్య వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయంపల్లిలో డ్రై డే

ఉరవకొండ రూరల్: మండలంలోని రాయంపల్లిలో శుక్రవారం కొకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. తొట్టెలు, టైర్లు, డ్రమ్ముల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచడంతో మలేరియా కీటకాలు వృద్ధి చెందుతాయన్నారు. ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.